ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

ఆదివారం 9 నవంబరు 2025



తోటపల్లికి పోటెత్తిన భక్తులు 6లో



సీతంపేట ఎన్టీఆర్ అడ్వంచర్ పార్కులో హ్యాంగింగ్ బ్రిడ్జి



చూసొద్దాం రండి

- ఉమ్మడి జిల్లాలో పర్యాటక ప్రాంతాలెన్నో..
- కట్టిపడేసే ప్రకృతి సహజ సిద్ధ అందాలు
- ఆకట్టుకునే జలపాతాలు.. ఆధ్యాత్మిక ప్రదేశాలు
- విహారయాత్రలు, పిక్నిక్‌లకు ఎంతో అనుకూలం

మేఘాలు తాకేలా ఎత్తయిన కొండలు.. మనసు పులకరించే పచ్చని వనాలు.. జాలువారే జలపాతాల హొయలు.. అలలు ఎగసిపడి మదిని ఉప్పొంగించే కడలి తీరాలు.. ఆధ్యాత్మికతను పంచే క్షేత్రాలు.. ఆహ్లాదాన్ని ఇచ్చే ప్రకృతి అందాలు..! గురించి చెబితే ఎవరికైనా వెంటనే చూడాలని అనిపిస్తుంది. మరెందుకు ఆలస్యం ఇవన్నీ ఉమ్మడి జిల్లాలోనే ఉన్నాయి. సందర్శకులు, పర్యాటకులను ఆహ్వానిస్తున్నాయి. ప్రస్తుతం కార్తీకమాసం కావడంతో మదిని దోచే ఆ ప్రాంతాలను ఒక్కసారి చుట్టేద్దాం.

ప్రత్యేక కథనం 6లో



సాలూరు మండలంలో జలపాతం



పూర్తయిన తోటపల్లి - గుణుపూర్ రహదారి

దారి చూపించారు!

- గత వైసీపీ సర్కారు నిర్లక్ష్యంతో పూర్తికాని రోడ్డు నిర్మాణాలెన్నో..
- అసంపూర్తిగా నిలిచిన వాటిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి
- పెండింగ్ బిల్లులు చెల్లింపు.. పనుల వేగవంతానికి చర్యలు
- మరోవైపు నూతన రహదారుల నిర్మాణానికి భారీగా నిధులు మంజూరు

పార్వతీపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం రోడ్ల విషయంలో ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించిందో తెలిసిందే. కనీసం మరమ్మతులు కూడా చేపట్టని పరిస్థితి. ఎంతో హడావుడిగా జిల్లాలో రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన చేసినా.. బిల్లులు మాత్రం చెల్లించలేక పోయింది. ఈ క్రమంలో కాంట్రాక్టర్లు చేతులెత్తేయడంతో రోడ్డు పనులకు బ్రేక్ పడింది. ఈ నేపథ్యంలో అడుగుకో గుంతతో జిల్లాలో వాహనదారులు, ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. పట్టుమని కిలోమీటరు కూడా సాఫీగా ప్రయాణించలేని దుస్థితి. ఒకవైపు రహదారులపై గోతులు పూడ్చక.. మరోవైపు నిర్మాణాలు పూర్తికాక ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిపై దృష్టి సారించింది. ప్రజా సమస్యలను పరి గణనలోకి తీసుకుని.. సుమారు రూ.25 కోట్ల వరకూ పెండింగ్ బిల్లులను చెల్లించి రోడ్డు పనులు పునఃప్రారంభమయ్యే విధంగా చర్యలు చేపట్టింది. మరోవైపు కొన్ని ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి భారీగా నిధులు మంజూరు చేసింది. దీనిపై జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బిల్లుల చెల్లింపు ఇలా..

- గత వైసీపీ ప్రభుత్వ కాలంలో పాలకొండ నియోజకవర్గ పరిధి నవగాం-జంపరకోట రహదారి నిర్మాణాన్ని ప్రారంభించారు. అయితే బిల్లులు చెల్లించక పోవడంతో పనులకు బ్రేక్ పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.కోటి 37లక్షలు చెల్లించి ఆ పనులు పునఃప్రారంభమయ్యే విధంగా చర్యలు తీసుకుంది.
- కురుపాం నియోజకవర్గంలో తోటపల్లి నుంచి గుణుపూర్ రహదారి పనులకూ వైసీపీ సర్కారు బిల్లులు చెల్లించలేదు. కూటమి ప్రభుత్వం రూ.మూడు కోట్ల 91 లక్షల వరకూ బిల్లులు చెల్లించి ఆ పనులను పూర్తి చేయించింది.
- పార్వతీపురం-కోరాపుట్ రహదారి నిర్మాణానికి అప్పటి పాలకులు అట్టహాసంగా

(మిగతా 8వ పేజీలో...)



పార్వతీపురం-నర్సిపురం రోడ్డు ఇలా..

రూ.25కోట్లు చెల్లించాం

జిల్లాలో అసంపూర్తిగా నిలిచిన రహదారుల నిర్మాణాలకు సంబంధించి ఇప్పటివరకు సుమారు రూ.25 కోట్ల వరకు పెండింగ్ బిల్లులు చెల్లించాం. ఇందులో కొన్ని పనులు పునఃప్రారంభమయ్యాయి. మరికొన్ని పూర్తి చేశాం. కొత్త రహదారి నిర్మాణాలకు చర్యలు చేపడుతున్నాం. కొన్నింటికి టెండర్లు పిలవాల్సి ఉంది.

- రాధాకృష్ణ, జిల్లా ఇంజనీరింగ్ అధికారి, ఆర్అండ్‌బీ

మరో ఇద్దరు..

- జిల్లా ఆసుపత్రికి గిరిజన విద్యార్థుల రెఫర్
- నాలుగుకి చేరిన జాండీస్ బాధితుల సంఖ్య

సీతంపేట రూరల్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): సీతంపేటలో మరో ఇద్దరు గిరిజన విద్యార్థుల్లో పచ్చకామెర్ల లక్షణాలు కనిపించాయి. దీంతో వారిని పార్వతీపురం జిల్లాకేంద్రాసుపత్రికి రెఫర్ చేశారు. ఇప్పటికే సీతంపేట గిరిజనసంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు గిరిజన విద్యార్థులు (ఏడో తరగతి) పచ్చకామెర్లతో శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీనిపై ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అప్రమత్తమయ్యారు. ఆయన ఆదేశాల మేరకు శనివారం ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందర్నీ పాలకొండ, సీతంపేట ఏరియా ఆసుపత్రులకు తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. కాగా 8, 9 తరగతులు చదువుతున్న బిడ్డిక లీలాసాయి, పాలక చరణ్‌లకు జాండీస్ లక్షణాలు కనిపించాయి. దీంతో వైద్యసిబ్బంది సూచనల మేరకు పాఠశాల హెచ్‌ఎం చంద్రరావు, వార్డెన్ గాసయ్యలు ఆ విద్యార్థులను ఐటీడీఏ అంబులెన్స్ ద్వారా జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఉప్పరజమ్మి, మసాన్‌పుట్టి గ్రామాల్లో ఉంటున్న వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మొత్తంగా ఈ పాఠశాలలో పచ్చకామెర్లతో బాధపడుతున్న విద్యార్థుల సంఖ్య నాలుగుకి చేరింది.



జిల్లా ఆసుపత్రికి వెళ్తున్న గిరిజన విద్యార్థులు

మన్యాన్ని పర్యాటక హబ్‌గా మార్చాలి

- కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

సాలూరు రూరల్/పాచిపెంట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిని పర్యాటకులకు పరిచయం చేసి.. జిల్లాను పర్యాటక హబ్‌గా మార్చాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. శనివారం పాచిపెంట మండలం నీలంవలస జలపాతాన్ని సందర్శించారు. పర్యాటకంగా అభివృద్ధి చేయ డానికి గల అవకాశాలను పరిశీలించారు. ఈ మేరకు జలపాతం వద్దే అధికారులతో సమీక్షించారు. సుందరంగా ఉన్న నీలంవలస జలపాతం పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తుందన్నారు. దట్టమైన అటవీప్రాంతంలో కొండల నడుమ ఉన్న ఈ జలపాతాన్ని ప్రకృతి ప్రేమికులకు ఎంతో నచ్చు తుందని తెలిపారు. ప్రకృతి ప్రేమికులు, సాహస యాత్రికులు, ఫొటో గ్రాఫర్స్‌కు మధురానుభూతిని అందిస్తుందని వెల్లడిం చారు. దీని అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాల న్నారు. అనంతరం రాళ్లతో ఏర్పాటు చేసిన స్విమ్మింగ్‌పూల్‌ను పరిశీలించి.. యువత, అధికారులతో కలిసి దానిని శుభ్రపర్చే కార్యక్రమంలో పాల్గొన్నారు.

'ముస్తాబు' అమలుపై సంతృప్తి

పాచిపెంట మండలం సురగడవలస జీపీఎస్ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ముస్తాబు కార్యక్రమం అమలును పరిశీలించారు. విద్యార్థులు పరిశుభ్రంగా ఉండడాన్ని గమనించారు. మండల విద్యాశాఖ , సురగడవలస హెచ్‌ఎంను శ్రీనివాసరావును అభినందించారు. అనంతరం ముస్తాబు కార్యక్రమం లక్ష్యం, ఏ విధంగా పరిశుభ్రత పాటించాలనే దానిపై గిరిజన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆ తర్వాత 104 చంద్రన్న సంచార వైద్య కార్యక్రమాన్ని పరిశీలించి మెడికల్ సిబ్బందితో మాట్లాడారు. స్థానిక గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆ గ్రామానికి చెందిన ఆరో తరగతి విద్యార్థి యోగిష్‌కు కంటిచూపు సమస్య ఉన్నట్టు ఆయన దృష్టికి వచ్చింది. దీంతో విద్యార్థి నేత్ర చికిత్సకు తగిన ఏర్పాట్లు చేయాలని 104 మెడికల్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. పాచిపెంట మండలంలో 'ముస్తాబు' అమలు తీరును సోషల్‌మీడియాలో సైతం ఆయన ప్రస్తావించారు.



నీలంవలస జలపాతం వద్ద కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు

టీడీపీ హయాంలోనే ఎయిర్ పోర్టుకు భూసేకరణ

- డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున

6లో

ముగిసిన ఆహ్వాన నాటిక పోటీలు

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయాలి: జేసీ

6లో



కౌలు రైతులకు గుర్తింపు

- ఓ నెంబర్‌తో కార్డు జారీకి ప్రభుత్వం చర్యలు



మెంటాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చేదిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారించారు. భూములున్న రైతులతో సమానంగా వారికి కూడా ప్రయోజనాలు అందేలా చర్యలు ప్రారంభించారు. ఏం చేస్తే వారికి న్యాయం, భరోసా దక్కుతుందనే అంశంపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని యంత్రాంగానికి ఆదేశాలు ఇచ్చారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్ర వ్యవసాయ ఉన్నతాధికారులు ఓ ప్రతిపాదన ముఖ్యమంత్రి ముందు ఉంచారు. ఆ ప్రకారం కౌలురైతులకు ఓ విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయించనున్నారు. తుదిరూపు దాల్చిన ఈప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తిచేసి కౌలు రైతులకు తీపికబురు చెప్పేందుకు వడివడిగా అడుగులు వేస్తున్నారు. కాగా దీనిద్వారా వారు భూములున్న రైతులతో సమానంగా ప్రభుత్వ ప్రయోజనాలు పొందనున్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోతే ప్రభుత్వం వారిని ఆదుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది. అంతేకాకుండా మరిన్ని ప్రయోజనాలు కూడా కౌలురైతులకు చెందేలా చూడాలని సీఎం చంద్రబాబు చెబుతుండడంతో ఉన్నతాధికార యంత్రాంగం ఆపనిలో ఉంది. ఇచ్చినమాట నిలుపుకునేలా వీలైనంత త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిపై అధికారిక ప్రకటన చేయనున్నారు. ఇది అమల్లోకి వస్తే కౌలురైతుల ఇక్కట్లు తొలగి వారుకూడా గౌరవప్రదమైన జీవితం గడిపేందుకు అవకాశం లభిస్తుంది.

రివిజన్ పరీక్షలు ఎలా? 6లో

- సిలబస్ కాకుండా నిర్వహించడం అసాధ్యం

తోటపల్లి ఆలయ ట్రస్టు బోర్డు సభ్యుల నియామకం 8లో

పెద్దగెడ్డకు రూ.67 కోట్లు 8లో

- కొట్టక్కి వద్ద వంద ఎకరాల్లో పార్క్
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



వివాదంలో ఉన్న కురుపాం ఎక్సైజ్ కార్యాలయం

ఎక్సైజ్ శాఖకు కష్టాలు!

- కార్యాలయాలకు సొంత భవనాలు కరువు
- ప్రతినెలా వేలల్లో అద్దె చెల్లింపు
- ఏప్రిల్ నుంచి కానరాని వెహికల్ అలవెన్స్
- సొంత డబ్బుతో డీజిల్ కొనుగోలు
- వేధిస్తున్న సిబ్బంది కొరత .. కొరవడిన పర్యవేక్షణ

జియ్యమ్మవలస, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎక్సైజ్ శాఖ అనేక సమస్యలతో సతమతమవుతోంది. ప్రధానంగా కార్యాలయాలకు సొంత భవనాల్లేవు. అన్నీ అద్దె గృహాల్లోనే కొనసాగుతున్నాయి. పూర్తిస్థాయిలో సిబ్బంది కూడా లేరు. దీంతో పర్యవేక్షణ కొరవడుతోంది. ఉన్న సిబ్బందిపై పనిభారం పెరుగుతోంది. మరోవైపు ఫైనాన్షియల్ అనుమతి లేక నిధులున్నా వెచ్చించలేని పరిస్థితి.. వెహికల్ అలవెన్స్ కూడా లేకపోగా.. ప్రతినెలా సిబ్బంది సొంత డబ్బులతో డీజిల్ కొను గోలు చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో అత్యవసర వేళల్లో అవసరమైన చోటుకు వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు.


అన్నీ అద్దె గృహాలే..

జిల్లాలో సాలూరు, సీతానగరం, పార్వతీపురం, కురుపాం, పాలకొండలలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. వీటితో పాటు సూపరింటెండెంట్ కార్యాలయం ఉంది. ఇవన్నీ అద్దె గృహాల్లోనే కొనసాగుతున్నాయి. వీటికి ప్రతి నెలా అద్దె కింద ప్రభుత్వం రూ. 71,337 చెల్లిస్తోంది. ఇందులో సూపరింటెండెంట్ కార్యాలయానికి రూ. 19,784, కురుపాం సర్కిల్ కార్యాలయానికి రూ.6,542, పాల కొండకు రూ. 12,300, పార్వతీపురానికి రూ. 9,684, సీతాన గరానికి రూ. 10,722, సాలూరు సర్కిల్ కార్యాలయానికి

(మిగతా 8వ పేజీలో...)



అద్దె గృహంలో నడుస్తున్న పాలకొండ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం



చూసొద్దాం రండి

- ఉమ్మడి జిల్లాలో పర్యాటక ప్రాంతాలెన్నో..
- కట్టిపడేసే ప్రకృతి సహజసిద్ధ అందాలు
- ఆకట్టుకునే జలపాతాలు.. ఆధ్యాత్మిక ప్రదేశాలు
- విశాల సముద్రతీరం.. మనకే సొంతం
- విహారయాత్రలు, పిక్నిక్‌లకు ఎంతో అనుకూలం



సీతంపేట ఎన్టీఆర్ అడ్వంచర్ పార్కు



సీతంపేట మండలంలోని ఆడలి వ్యూపాయింట్

రాజాం/ సాలూరు రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి):

కార్తీకమాసమంటే పెద్దలతో పాటు చిన్నారులకు ఆనందమే. ఎందుకంటే ఇప్పటివరకు రొటీన్ లైఫ్‌లో బిజీగా గడిపేవారు ఈ మాసంలో కాస్త సేదతీరడానికి పిక్నిక్‌లు, విహారయాత్రలకు వెళ్లడానికి ఉత్సుకత చూపుతారు. ఇందుకోసం ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటారు. ఉమ్మడి జిల్లాలోని సందర్శక ప్రాంతాలెన్నో ఉన్నాయి. ఈ కార్తీక మాసంలో కుటుంబసభ్యులతో వాటిని సందర్శించి సరదాగా గడపొచ్చు. పిల్లలతో కలిసి ఆడిపాడొచ్చు. ఎత్తయిన కొండలు, ప్రకృతి సహజసిద్ధ అందాలు, జలపాతాలు, విశాల సముద్రతీరం, ఆధ్యాత్మిక ప్రదేశాలకు నెలవైన ఉమ్మడి జిల్లాలో కొన్ని సందర్శక ప్రాంతాలను ఇప్పుడు తెలుసుకుందాం.

● చింతపల్లి బీచ్..

విజయనగరం జిల్లాలో 29 కిలోమీటర్ల మేర సాగర తీరం ఉంది. పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో విస్తరించి ఉంది. ప్రధానంగా చింతపల్లి బీచ్ పిక్నిక్‌లకు ప్రత్యేకం. వేలాది మంది ఈ బీచ్‌కు వస్తుంటారు. పర్వదినాల్లో సముద్రపు స్నానాలు ఆచరిస్తుంటారు. అక్కడికి సమీపంలో 17వ శాతాబ్దపు నాటి కుమిలి ద్వాదశ దేవాలయం ఉంది. ఆలయాన్ని సందర్శించి ఎక్కువ మంది చింతపల్లి బీచ్‌కు చేరుకుంటారు. వీటికితోడు జిల్లాలో నాగావళి, చంపావతి, వేగావతి, సువర్ణముఖి నదులు సైతం ప్రవహిస్తున్నాయి. మరోవైపు పవిత్ర నాగావళి నది చెంతనే వంగర మండలం సంగమేశ్వరాలయం ఉంది. బొబ్బిలిలో వేణుగోపాలస్వామి ఆలయం, సంతకవిటి మండలం గుళ్ల సీతారాంపురం ఆలయం, రాజాం పైడితల్లి, నవదుర్గ ఆలయాలు పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలే.

● రామతీర్థం..

రామతీర్థం.. ఆధ్యాత్మిక, పర్యాటకంగా ఎంతగానో అభివృద్ధి చెందుతూ వస్తోంది. ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతో పాటు



పుణ్యగిరి కొండపై ధారగంగమ్మ జలపాతం

మన్యం నుంచి భక్తులు తరలివస్తుంటారు. ఆలయం చెంతనే భారీ కొండ చూడముచ్చటగా ఉంటుంది. కొండపై నుంచి చూస్తే ఓ వైపు విజయనగరం అందాలు, మరోవైపు పచ్చని పంట పొలాలు తివాచీ పరిచినట్లు ఉంటాయి. చెంతనే కోనేరు సైతం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

● రామనారాయణం..

విజయనగరం అంటే గుర్తుకు వచ్చే పర్యాటక ప్రాంతం రామనారాయణం. తెలుగు రాష్ట్రాల్లో ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా ఎంతో గుర్తింపు పొందింది.



తాటిపూడి రిజర్వాయర్‌లో స్పీడ్ బోటు షికారు

ఉత్తరాంధ్రలో ఆధ్యాత్మిక క్షేత్రాల సందర్శనకు వచ్చేవారు తప్పకుండా రామనారాయణం చూసేందుకు వస్తుంటారు. రామబాణం ఆకృతిలో నిర్మించిన రామనారాయణం శ్రీమద్రామాయణ ఆలయం. 2014లో విజయనగరానికి చెందిన దివంగత నారాయణం నరసింహమూర్తి కుటుంబసభ్యులు తమ తండ్రి ఆశయం మేరకు నిర్మించారు. సుమారు 15 ఎకరాల విస్తీర్ణంలో 72 శిల్పాలతో శ్రీరాముడి జీవితచరిత్రను వివరించా రు. 60 అడుగుల ఆంజనేయస్వామి, శివపార్వతులు, సరస్వతి విగ్రహాలు ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. భక్తులు, పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటాయి.

● తాటిపూడి జలాశయం..

తాటిపూడి జలాశయం అనేది విజయనగరం జిల్లాకే ప్రత్యేక ఆకర్షణ. చుట్టూ కొండల నడుమ గంట్యాడ మండలంలో గోస్తనీ నదిపై నిర్మించారు. ఇది పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తుంది. ఇక్కడ బోటు విహారానికి ఉత్తరాంధ్ర వాసులే కాకుండా ఒడిశా, చత్తీస్‌గఢ్ నుంచి కూడా పర్యాటకులు విచ్చే స్తారు. ప్రకృతి అందాలు తిలకించి, జలాశయంలో విహరించి ఆనందంలో తేలియాడుతారు. జలాశయం అవతలి వైపు కొండపై పర్వత గణపతి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. తాటిపూడి మీదుగా అరకు, లంబసింగి, అనంతగిరి ప్రాంతాలకు కూడా వెళ్లొచ్చు.

ఎన్టీఆర్ అడ్వంచర్ పార్కు..

సీతంపేటలో ఎన్టీఆర్ అడ్వాంచర్ పార్కు పర్యాటకానికి ల్యాండ్ మార్కుగా నిలుస్తోంది. ఇక్కడ సాహస క్రీడలు, బోటింగ్, 5డీ థియేటర్ పర్యాటకులను ఇట్టే ఆకర్షిస్తాయి. మెట్టుగూడ, సున్నపుగెడ్డ, మల్లి, బెనరాయి జలపాతాలు మైమరపిస్తాయి. ఇటీవల అభివృద్ధి చేసిన అడలి వ్యూ పాయింట్‌కు వెళితే..మేఘాలు చేతికి అందే ఎత్తులో మదిని దోచేస్తాయి. జగతపల్లి, పొల్ల వ్యూ పాయింట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. వీటికితోడు సీతంపేటలో టీటీడీ నిర్మించిన వేంకటేశ్వరాలయం, కన్నెధార కొండపై ఉన్న శ్రీరామగిరి క్షేత్రం, అమ్మవారి ఆలయాలను సైతం దర్శించుకోవచ్చు.

● జలపాతాల హొయలు..

ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలోని ఏజెన్సీలో జలపాతాలు మరింతగా ఆకట్టుకుంటున్నాయి. అలూరు, తోణాం, శిఖపరువు, దండిగాంతో పాటు సీతంపేట మండలంలో జలపాతాలు మనసుకు హత్తుకుంటాయి. గుమ్మలక్ష్మీపురం మండలం తాడికొండ జలపాతాన్ని ప్రతి ఒక్కరూ సందర్శించాల్సిందే. కొండలపై నుంచి ఊట నిత్యం జాలువారుతూ ఉంటుంది. ఈ జలపాతాన్ని ఐటీడీఏ అభివృద్ధి చేసింది. ఏటా కార్తీక మాసంలో ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా నుంచి భక్తులు ఎక్కువగా వస్తుంటారు.



చింతపల్లి బీచ్



విజయనగరంలోని రామనారాయణం



సాలూరు మండలంలో దండిగాం జలపాతం

తోటపల్లికి పోటెత్తిన భక్తులు

● బందోబస్తు నిర్వహణ ● తాగునీరు, టెంట్ల ఏర్పాటు

గరుగుబిల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తోటపల్లిలోని వేంకటేశ్వరస్వామి, కోదండరామస్వామి దేవస్థానాలకు భక్తులు పోటెత్తారు. కార్తీకమాసం రెండో శనివారం కావడంతో సుమారు ఎనిమిది వేల మంది భక్తులు దర్శించుకున్నారు. కాశీబుగ్గలో నెలకొన్న సంఘటనను దృష్టిలో పెట్టుకుని అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. భక్తులు అధికంగా రానున్న సమాచారం తెలుసుకుని దేవస్థానం ఈవో బి.శ్రీనివాస్ క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. భక్తులకు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి



భక్తులతో కిటకిటలడిన తోటపల్లి దేవస్థానం ప్రాంగణం

అసౌకర్యం కలగకుండా ఉండేలా ప్రత్యేకంగా టెంట్లుతో పాటు తాగునీరు ఏర్పాటు చేశారు. క్యూలైన్ల ప్రాంతంలో తోపులాటలు జరగకుండా ఉండేలా గరుగుబిల్లి ఎస్ఐ షేక్ ఫకృద్దీన్, సిబ్బంది పర్యవేక్షించారు. 200 మందికిపైగా శ్రీవారి సేవకులు భక్తులకు సేవలం దించారు. తోటపల్లి దేవస్థానం అభివృద్ధి కమిటీ ప్రతినిధులు అన్న సమారాధన నిర్వహించారు. ఉప ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయాలి

● జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

బెలగాం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో దాగిఉన్న ప్రతిభను వెలికితీసి, వారికి ఉన్నత వేదికలపై అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జేసీ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక బెలగాంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు జన జాతీయ గౌరవ్ దివాస్ వేడుకల్లో భాగంగా నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీలను జేసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడానికి ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ పి.మురళీధర్, ఆర్.కృష్ణవేణి పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి



స్వప్నం రాల్చిన అమృతం నాటికలో ఓ సన్నివేశం

ముగిసిన ఆహ్వాన నాటిక పోటీలు

● ఆద్యంతం ఆకట్టుకున్న ప్రదర్శనలు

విజయనగరం కల్చరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నాటక శాల అభినయ సంయుక్త నిర్వహణలో స్థానిక గురజాడ కళాభారతిలో మూడు రోజులుగా జరుగుతున్న 9వ ఆహ్వాన నాటిక పోటీలు శనివారం రాత్రితో ముగిశాయి. చివరిరోజు చైతన్య భారతి (కరీంనగర్) ప్రదర్శించిన 'స్వప్నం రాల్చిన అమృతం', గోవాడ క్రియేషన్స్(హైదరాబాద్) ప్రదర్శించిన 'అమ్మచెక్కిన బొమ్మ' నాటికలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. యువతను, సమాజాన్ని మేల్కొలిపే విధంగా, రోజురోజుకీ దిగజారుతున్న మానవతా విలువలు అద్దం పట్టేలా ఈ నాటికలను ప్రదర్శించారు. భగవతీ నృత్య కళాక్షేత్ర చిన్నారులు నిర్వహించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ, సీనియర్ కళాకారులు బూరాడ శ్రీనువాసరావు, పలువురు ప్రముఖులు, కళాభిమానులు హాజరై తిలకించారు. నటరత్న నాటక పరిషత్ అధ్యక్షుడు అభినయ శ్రీనువాస్, కార్యదర్శి గెద్ద వరప్రసాద్ పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే ఎయిర్‌పోర్టుకు భూసేకరణ

● పనులు అడ్డుకున్నది వైసీపీ ప్రభుత్వమే ● డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున

విజయనగరం టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): 'టీడీపీ ప్రభుత్వ హయాంలోనే భోగాపురం ఎయిర్‌పోర్టుకు శతశాతం భూసేకరణ, పనులకు శంకుస్థాపన జరిగింది. వైసీపీ ప్రభుత్వం భూసేకరణ చేసిందని జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చెప్పడం హాస్యాస్పదంగా ఉంది.' అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు.



మాట్లాడుతున్న నాగార్జున

కేంద్ర విమానయానా శాఖామంత్రి కింజరాపు రామ్మోహనాయుడుపై జడ్పీ చైర్మన్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. భోగాపురానికి ఎయిర్‌పోర్టు రాకూడదని మాట్లాడిన వ్యక్తి జగన్మోహన్‌రెడ్డి అని, అంతేకాక పోర్టు భూముల్లో వైసీపీ నేతల భూములు ఉంటే వారితో కేసులు పెట్టించి పనులు జరగకుండా అడ్డుకున్నది వైసీపీ ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు. ఐదేళ్ల అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఎయిర్ పోర్టు నిర్మాణంలో ఒక్క ఇటుక కూడా వేయలేకపోయిందన్న విషయాన్ని జడ్పీ చైర్మన్ గుర్తుకు చేసుకోవాలన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత భోగాపురం ఎయిర్‌పోర్ట్ పనులు జోరుగా జరుగుతున్నాయన్నారు. మరో ఏడాదిలో పనులు పూర్తిచేసి ప్రజలకు ప్రభుత్వం అంకితం చేస్తుందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ ఎంపీలు 22 మందిలో ఒక్కరైనా పార్లమెంట్‌లో రాష్ట్ర అభివృద్ధికి పాటుపడ్డారా అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో కింజరాపు రామ్మోహన్ నాయుడు, భరత్, పెమ్మసాని చంద్రశేఖర్ వంటి విద్యావంతులైన ఎంపీలు రాష్ట్ర అభివృద్ధికి పాటు పడడంతో పాటు పార్లమెంట్‌లో తమదైన వాణీని వినిపిస్తున్నారని తెలిపారు. ప్రాజెక్టులు, ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్నారని చెప్పారు. భోగాపురం ఎయిర్‌పోర్టును త్వరలో వినియోగంలోకి తీసుకువచ్చి ఉత్తరాంధ్ర స్థితిగతులను మారుస్తామని పేర్కొన్నారు.



రివిజన్ పరీక్షలు ఎలా?

- సిలబస్ కాకుండా నిర్వహించడం అసాధ్యం
- డీఈవో ఆదేశాలపై ఉపాధ్యాయుల ఆగ్రహం

రాజాం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి)

పాఠశాల విద్యాశాఖ పేరిట జారీ అవుతున్న ఉత్తర్వులపై జిల్లాలో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా పదో తరగతి రివిజన్ టెస్టులపై డీఈవో ఆదేశాల పట్ల ఉపాధ్యాయులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అసలు సిలబస్ పూర్తికాకుండా రివిజన్ టెస్టులు ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇతర జిల్లాల్లో రివిజన్ టెస్టులపై నిర్ణయం తీసుకోలేదని.. అటువంటిది ఇక్కడ ఎందుకీ పరిస్థితి అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటి వరకూ ఎఫ్ఏ1, ఎఫ్ఏ2 పరీక్షలు జరిగాయి. అకడమిక్ క్యాలెండర్ అనుసరించి నవంబరు 9 నుంచి ఎస్ఏ1 పరీక్షలు జరుగుతాయి. అదేనెల 19 వరకూ కొనసాగుతాయి. కానీ అంతకన్నా ముందే పదో తరగతి విద్యార్థులకు రివిజన్ టెస్టులు నిర్వహించాలని డీఈవో ఆదేశించడంపై ఉపాధ్యాయులు ఆగ్రహంగా ఉన్నారు.

అకడమిక్ క్యాలెండర్ ప్రకారం..

ఈ ఏడాది జూన్ 12న విద్యాసంవత్సరం ప్రారంభమైంది. పాఠశాల విద్యాశాఖ అకడమిక్ క్యాలెండర్‌ను సైతం విడుదల చేసింది. ఉదయ 8 గంటల నుంచి 9 గంటల వరకూ.. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకూ పదో తరగతి విద్యార్థులకు అదనపు తరగతులు, ఆపై స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. మరోసారి అర్ధసంవత్సరం పరీక్షలుగా పరిగణించే సమెటివ్ 1 పరీక్షల నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయి. అందుకు అనుగుణంగా సిలబస్ బోధన సాగుతోంది. అదే సమయంలో ఇప్పుడు అక్టోబరు 21 నుంచి రివిజన్ టెస్టులు విధిగా నిర్వహించాలని డీఈవో ఆదేశాలు ఇవ్వడం ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల్లో గందరగోళానికి దారితీస్తోంది. ఒకవైపు అదనపు తరగతులు, మరోవైపు స్టడీ అవర్స్ ఇంకోవైపు ఎస్ఏ1 పరీక్షలకు సన్నాహాలు, అందుకు అనుగుణంగా సిలబస్ పూర్తిచేయడానికి ఉపాధ్యాయులు ప్రయత్నిస్తున్నారు. సరిగ్గా ఇటువంటి సమయంలోనే రివిజన్ టెస్టులు విధిగా నిర్వహించాలంటూ ఉపాధ్యాయుల నుంచి విస్మయం వ్యక్తమవుతోంది. దీనిని పునఃపరిశీలించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఆదేశాలు వెనక్కి తీసుకోవాలి..

రాష్ట్రంలో ఎక్కడా ఇటువంటి ఆదేశాలు లేవు. కేవలం విజయనగరం జిల్లాలో ఇవ్వడం ఏమిటి? ముందుకు అర్ధసంవత్సరం పరీక్షలు ఎస్ఏ1 పెట్టుకొని రివిజన్ టెస్టులు ఏంటి? ఇప్పటికే సిలబస్ పూర్తికాలేదు. మరోవైపు ఉదయం అదనపు తరగతులు, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. ఇటువంటి సమయంలో రివిజన్ టెస్టులు అనేవి సాధ్యం కాదు.

-మజ్జి మదన్‌మోహన్, ఉమ్మడి జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్షుడు, రాజాం

రివిజన్ పరీక్షలు నిర్వహించమని ఆదేశాలు ఇచ్చాం..

జిల్లా స్థాయిలో 10వ తరగతి విద్యార్థులకు రివిజన్ పరక్షలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశాం. ఈ ఏడాది మంచి ఫలితాలు సాధించడమే ధ్యేయంగా ఉపాధ్యాయులు పనిచేయాలి. సిలబస్‌ను నవంబరు 15వ తేదీలోగా పూర్తిచేసి అనంతరం పరిక్షలు నిర్వహిస్తాము. కొన్ని హైస్కూల్స్‌ను సందర్శించడమే కాకుండా, ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించి సకాలంలో పెండింగ్ సబ్జెక్టులు సిలబస్ పూర్తి చేయమని ఆదేశించాము.

-డి.మాణిక్యాలనాయుడు, జిల్లా విద్యాశాఖ అధికారి, విజయనగరం

పారదర్శకంగానే పోస్టుల భర్తీ

మెంటాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ఇటీవల 55 మంది నాన్ టీచింగ్ సిబ్బంది నియామకాలు పారదర్శకంగానే జరిగాయిని జిల్లా సర్వశిక్ష అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'టార్గెట్..15 లక్షలు' శీర్షికతో శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. అవకతవకలకు ఆస్కారం లేకుండా నిబంధనలు ప్రకారమే నియామకాలు చేపట్టామన్నారు. ఎంపికైన 55 మంది అభ్యర్థులకు అవుట్ సోర్సింగ్ పద్ధతి ద్వారా నియామక ఉత్తర్వులు అందజేశామని వివరించారు. వారి నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్నట్లు తమకు ఎటువంటి ఫిర్యాదులు అందలేదని అన్నారు.

డిజిటల్ అసిస్టెంట్ సస్పెన్షన్

మెంటాడ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జయతి సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ నెక్కల శ్రీనును అధికారులు సస్పెండ్ చేశారు. గత నెల 15మంది సామాజిక పించనుదారులకు అందించాల్సిన పింఛన్ డబ్బు రూ.70,500 ఆయన సొంత అవసరాలకు వాడుకొని అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఆయన్ను సస్పెండ్ చేసినట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో విమలకుమారి తెలిపారు.

విద్యార్థినికి ఏఐ సర్టిఫికెట్


విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తవలస, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న పసుమర్తి అశ్విని అనే విద్యార్థినికి ఐఐటీ మద్రాస్.. డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ)కు సంబంధించిన సర్టిఫికెట్‌ను అందజేసింది. స్కూల్ కనెక్టవిటీ కార్యక్రమంలో అశ్విని ప్రతిభకనబరడడంతో ఈ సర్టిఫికెట్‌ను అందచేశారు. పాఠశాల ఉపాధ్యాయుడు బాపునాయుడు గైడ్‌గా వ్యవహరించారు. అశ్వినిని హెచ్‌ఎం ఈశ్వరరావుతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

కొత్తవలస, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. గులివిందాడ గ్రామంలో రూ.5 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఆమె శనివారం ప్రారంభించారు. ప్రతిగ్రామానికీ అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని, అందుకు అవసరమైన నిధులను మంజూరు చేస్తామని ఆమె తెలిపారు. గత ప్రభుత్వం వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని అన్నారు. నాయకులు నక్కరాజు చినరాము, గొంపదుర్గా ఉమేష్, గవర ముత్యాలు నాయుడు, దొడ్డి నర్సింగరావు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

లక్కవరపుకోట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వివిధ రుగ్మతలతో బాధపడుతూ కార్పొరేట్ వైద్యం అందుకోలేని 22 మంది పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సుమారు రూ.13 లక్షలను ఎమ్మెల్యే లలితకుమారి అందజేశారు. శనివారం ఆమె నివాసం వద్ద బాధితులకు చెక్కులు అందించారు. కార్యక్రమంలో నాయకులు కేబీఏ రాంప్రసాద్, రాయవరపు చంద్రశేఖర్, జీఎస్ నాయుడు, గొంప వెంకటరావు, కొట్యాడ రమణమూర్తి పాల్గొన్నారు.

భక్త కనకదాసుకు నివాళి

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) జిల్లా బీసీ సంక్షేమ కార్యాలయంలోని శనివారం భక్త కనకదాసు జయంతి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి, సీపీవో బాలాజీ.. భక్తకనకదాసు చిత్రపటానికి పూల వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి జ్యోతిశ్రీ పాల్గొన్నారు.

రైతుల ఆదాయం రెట్టింపు కావాలి

● వ్యవసాయ అనుబంధ పరిశ్రమలపై దృష్టి పెట్టాలి ● మంత్రి కొండపల్లి


రైతు సమ్మేళనం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

నెల్లిమర్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతుల ఆదాయం రెట్టింపు చేయడానికి సెంచూరియన్ విశ్వ విద్యాలయం దోహదపడాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. శనివారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన రెండో రైతు సమ్మేళనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వ్యవసాయం లాభసాటిగా మారేందుకు అవసరమైన పరిజ్ఞానాన్ని రైతులకు అందించాలన్నారు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలైన పందుల పెంపకం వంటి వాటి ద్వారా కూడా రైతులు ఆదాయం పొందవచ్చునని అన్నారు. రైతులను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలని కోరారు. యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ డీఎన్.రావు మాట్లాడుతూ.. మట్టి లేకుండా వ్యవసాయం, గాలితో పంటలు పండించడం చేయవచ్చని తెలిపారు. వీటిని పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టామన్నారు. ఏడాదికి రూ.3 లక్షల నుంచి 4 లక్షల వరకు ఆదాయం పొందవచ్చునని వివరించారు. విజయనగరం, గజపతినగరం, నెల్లిమర్ల నియోజ కవర్గాల్లో గ్రామాలను దత్తత తీసుకొని నూతన పద్ధతులను అక్కడ రైతులకు వివరిస్తామని అన్నారు. విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ.. ఇక్కడ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసిన నాలుగేళ్లలోనే మంచి కోర్సు లను ప్రవేశపెట్టడమే కాకుండా రైతులకు ఉపయోగపడేలా ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. సీటీ స్కాన్, మోడల్ ల్యాబ్, సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్‌తో పాటు మరో రెండు ల్యాబ్‌లను మంత్రి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు లోకం నాగమాధవి, అదితి ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన నేత లోకం ప్రసాద్, వర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్. రాజు, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ మహంతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న మడ్డువలస షట్టర్

● 24ఎల్ కాలువలో స్థాయిని మించి పారుతున్న నీరు ● ఆందోళనలో రైతులు


షట్టర్ పరిస్థితి ఇలా..

సంతకవిటి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శ్రీహరినాయుడుపేట, కృష్ణంవలస, మద్దూరుశంకరపేట, సోమన్నపేట తదితర గ్రామాలకు సాగునీరు అందించే మడ్డువలస 24 ఎల్ కాలువ ద్వారా సాగునీరు స్థాయిని మించి ప్రవహిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 24 ఎల్ కాలువకు సాగునీరు విడిచిపెట్టేందుకు ఉపయోగించే షట్టర్ స్రూ రాడ్ వ్యవస్థ దెబ్బతింది. ఇది ప్రధాన కాలువలోకి పడిపోవడంతో ఆ బరువుకి షట్టర్ పైకి లేచిపోయింది. దీంతో కాలువలోకి సాగునీరు స్థాయిని మించి ప్రవహిస్తుంది. ఆ నీరు వరి కోతలు కోసిన పొలాల్లోకి చేరుతుండడంతో రైతులు అప్రమత్తమయ్యారు. వరి పనలను గట్లపైకి చేర్చారు. పూర్తి స్థాయిలో కోతలు జరిగి ఉంటే తీవ్రంగా నష్టపోయేవాళ్లమని రైతులు వాపోతున్నారు. అపరాలు జల్లేందుకు పొలాల్లో నీరు తగ్గించామని, ఇప్పుడు పొలాల్లోకి నీరు రావడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. అధికారులు స్పందించి కాలువలో నీటిని నిలుపుదల చేయాలని కోరుతున్నారు.

రెచ్చగొడితే ప్రజలు ఊరుకోరు

● వైసీపీ నాయకుల తీరుపై మంత్రి కొండపల్లి ధ్వజం

విజయనగరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో వచ్చే నెలలో జరగనున్న సీఐఐ భాగస్వాముల సదస్సుపై వైసీపీ నాయకుడు అంబటి రాంబాబు అనవసరంగా రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే ప్రజలు ఊరుకోరని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకుని వచ్చి 20 లక్షల మందికి ఉద్యోగాల కల్పన లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు పని చేస్తుంటే వైసీపీ నాయకులు చూసి ఓర్వలేకపోతున్నారని ధ్వజమెత్తారు. పార్టీలకు అతీతంగా ఎవరైతే తప్పు చేశారో? అటువంటివారిని శిక్షించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలోని స్పీడ్ అప్ డూయింగ్ బిజినెస్ చేసి పెట్టుబడులు తీసుకుని వచ్చే విధంగా యువ నాయకులు లోకేశ్ పని చేస్తున్నారని చెప్పారు. భోగాపురం ఎయిర్ పోర్టును వైసీపీ తీసుకుని వచ్చినట్లు జడ్పీ చైర్మన్ వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే భోగాపురానికి ఎయిర్‌పోర్టు వచ్చిందని గుర్తుచేశారు.

వృత్తి విద్యా నైపుణ్య పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాజాం/రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆగూరు పవన్, మక్కా సాయిసాత్విక్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం పి.వెంకటరావు తెలిపారు. రాష్ట్ర సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఇటీల జిల్లా స్థాయిలో నిర్వహించిన వృత్తి విద్యా నైపుణ్య పోటీల్లో వీరు ప్రతిభచాటారు. సాగులో రైతుల కష్టాన్ని తగ్గించి, సమయం, డబ్బు ఆదాచేసే విధంగా మల్టీ ఫంక్షనల్ ఫార్మింగ్ మిషన్‌ను వీరు తయారు చేశారు. సౌరశక్తి, పవన శక్తితో పాటు రిమోట్‌కంట్రోల్‌తో పని చేసేలా దీన్ని రూపొందించారు. దీంతో ఈ విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు అధికారులు ఎంపిక చేశారు. ఈ పరికరాన్ని పాఠశాలకు చెందిన అగ్రికల్చరల్ ఒకేషనల్ ట్రైనర్ గొర్లె స్వాతి ఆధ్వర్యంలో తయారు చేయగా, జీవశాస్త్రం ఉపాధ్యాయిని దేశరాజు వేదవతి లు సహకారం అందించారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ


పూజ నిర్వహిస్తున్న దృశ్యం

గరివిడి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కోడూరు గ్రామంలో శనివారం అయ్యప్పస్వామి 18 కలశాల మహాపడిపూజ ఘనంగా జరిగింది. వేలాది మంది అయ్యప్ప భక్తులు చేసిన శరణుగోషతో కోడూరు మార్మోగింది. పొగిరి లక్ష్మణరావు, సూర్యకళ దంపతుల నేతృత్వంలో గురుస్వామి యడ్ల పైడినాయుడు, నాగరాజుల ఆధ్వర్యంలో మహాపడి పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్ప, శివ, భవాని భక్తులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

రాజాం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పైపులైన్ మరమ్మతుల కారణంగా రాజాం మున్సిపాలిటీలో శనివారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సంకిలి వద్ద నాగావళి నది నుంచి వచ్చే ప్రధాన పైపులైన్ రేగిడి మండలం ఉంగరాడ మెట్టవద్ద లీకైంది. శుక్రవారం నుంచి పైపులైన్‌కు మరమ్మతులు చేపడుతున్నారు. శనివారం ఉదయం నాటికి పైపులైన్ వెల్డింగ్ పనులు పూర్తయ్యాయని, ఆదివారం నుంచి రాజాం మున్సిపాలిటీకి తాగునీరు సరఫరా చేస్తామని ఏఈ పొన్నాడ వెంకటరామరాజు తెలిపారు,

రోగులకు మెరుగైన సేవలందించాలి

భోగాపురం, నవంబరు8(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. సుందరపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆరోగ్య సలహాకమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్య రంగానికి ప్రభుత్వం అధిక నిధులు ఖర్చు చేస్తుందన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య అధికారులు వెంకటరమణ, షాలిని, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వందనాల రమణ, కమిటీ సభ్యులు బొల్లు త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

జంతు సంరక్షణ విద్యార్థుల బాధ్యత

గంట్యాడ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) జంతు సంరక్షణ బాధ్యత విద్యార్థులపై ఉందని రాష్ట్ర గోసంరక్షణ సమైఖ్య అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ అన్నారు. రావివలస పరిధిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో జంతు సంరక్షణపై విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు శనివారం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గోసంరక్షణ సమైఖ్య సభ్యులు సత్యనారాయణ, శాంతి, దేవి, కరక వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలపై దృష్టి

రేగిడి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల పిల్లల సంక్షేమం, విద్యాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎంపీడీవో శ్యామలాకుమారి, ఎంఈవో వరప్రసాదరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయలో శనివారం ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. వీరికి స్పెషల్ అలెవెన్స్ రూ.3వేల నుంచి రూ.6వేలకు పెంచినట్లు అధికారులు తెలిపారు. ఫిజియోథెరపిస్టు రాజేష్, వైస్‌ఎంపీపీలు అచ్చంనాయుడు, వి.జగన్మోహనరావు, ఐఈఆర్‌టీ టీచర్ ఉమామహేశ్వరీ, కేర్‌టేకర్ అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్లను వినియోగించుకోవాలి


అల్పాహారం చేస్తున్న వారితో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం టౌన్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): అన్నా క్యాంటీన్లను పేదలు వినియోగించుకోవలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. శనివారం ఉదయం నగరంలోని కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న అన్నా క్యాంటీన్‌ను ఆయన సందర్శించారు. అక్కడ అల్పాహారం తీసుకుంటున్న వారితో మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నగరంలో మూడు అన్నా క్యాంటీన్‌లు నిర్వహిస్తున్నామని, ప్రతిరోజూ ఉదయం 1500 మంది అల్పాహారం, మధ్యాహ్నం 1700మంది భోజనం, రాత్రి 800 మంది టిఫిన్ చేస్తున్నట్లు తెలిపారు.

జమ్ము ఘటనపై సీన్ రిక్రియేషన్


సీన్ రిక్రియేషన్ కోసం నిందితులను ఘటనా స్థలానికి తీసుకువచ్చిన పోలీసులు

గుర్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇటీవల జమ్ము గ్రామంలో దుర్గాదేవి నిమజ్జనంలో పోలీసులు, గ్రామస్థులకు మధ్య చెలరేగిన గొడవను శనివారం రిక్రియేషన్ చేశారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన 25 మంది విశాఖ జైలులో ఉన్నారు. సీన్ రిక్రియేషన్ కోసం వారిని శనివారం మధ్యాహ్నం విశాఖపట్నం నుంచి జమ్ము గ్రామానికి వాహనాల్లో తీసుకువచ్చారు. ఉదయం నుంచి గ్రామంలో పోలీసులు పహారా కాశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా చర్యలు చేపట్టారు. నిందితులను తీసుకువచ్చి సంఘటనా స్థలం వద్ద కొంతసేపు ఉంచారు. అక్కడి ప్రదేశాన్ని పరిశీలించి వెంటనే నిందితులను తమ వాహనాల్లో విశాఖపట్నం తరలించారు. ఈ కేసులో మరికొంతమంది నిందితులను అరెస్టు చేయనున్నట్టు ఎస్ఐ నారాయణరావు తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం


విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ

ఎస్.కోటరూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పెదఖండేపల్లి గ్రామంలో పెను ప్రమాదం తప్పింది. శనివారం ఉదయం ఒక లారీ గ్రామంలోకి ఎరువులను తీసుకొచ్చింది. ఈ సమయంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో అది సగానికి విరిగిపోయింది. ఈ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్దప్రమాదం తప్పింది. వెంటనే స్థానిక యువకులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో వారు సరఫరాను నిలిపివేశారు.

స్క్రాప్ దుకాణంలో అగ్ని ప్రమాదం


కాలిపోతున్న స్క్రాప్ దుకాణం

చీపురుపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహానికి అనుకుని ఉన్న స్క్రాప్ దుకాణంలో శనివారం అగ్ని ప్రమాదం జరిగింది. గంట సతీష్‌కు చెందిన ఈ దుకాణంలో సుమారు రూ.50వేలు విలువ చేసే ప్లాస్టిక్, ఇనుప వ్యర్థాలు కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారి సాంబమూర్తి తన సిబ్బందితో వచ్చి మంటల్ని అదుపు చేశారు. కాల్చి పడేసిన సిగరెట్ కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చునని అగ్నిమాపక అధికారులు అనుమానిస్తున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు


అప్పలరావు(ఫైల్)

గంట్యాడ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కొర్లాం గ్రామానికి చెందిన సింగిడి అప్పలరావు(55) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాయి కృష్ణ తెలిపారు. గత నెల 23న చేపలు అమ్మడానికి ఇంటి నుంచి వెళ్లిన అప్పలరావు తిరిగిరాలేదన్నారు. ఆయన కోసం కుటుంబీకులు తన బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసిన ఆచూకీ లభ్యం కాలేదన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు

భోగాపురం, నవంబరు8(ఆంధ్రజ్యోతి): మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ వి.రవికుమార్ హెచ్చరించారు. సవరవల్లి గ్రామంలో శనివారం బెల్టు దుకాణంపై దాడులు నిర్వహించి ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. బెల్టు నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు. ఆయన వెంట హెచ్‌సీలు సత్యనారాయణ, ప్రతాప్, సిబ్బంది మహేష్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

నిర్వాసితుల దీక్షలు పట్టావా?



నినాదాలు చేస్తున్న నిర్వాసిత రైతులు

ఎస్.కోటరూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిందాల్ సంస్థ మోసం చేసిందని బొడ్డవర గ్రామంలో 142 రోజులుగా నిర్వాసితులు నిరసన కార్యక్రమాలు, రిలే దీక్షలు చేస్తున్నా ప్రభుత్వానికి, అధికారులకు ఎందుకు పట్టడం లేదని జిల్లా రైతుసంఘ ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ప్రశ్నించారు. శనివారం జిందాల్ నిర్వాసితుల రిలే దీక్షల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 14తో పాటు అప్పట్లో చట్ట విరుద్ధగా జరిగిన భూముల రిజిస్ట్రేషన్లను కూడా రద్దుచేయాలని డిమాండ్ చేశారు. మరోసారి చట్టబద్ధంగా భూములు సేకరించి పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు.

క్రమశిక్షణతో మెలగాలి


రౌడీషీటర్లకు సూచనలిస్తున్న సీఐ

రాజాం రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మానవత్వం, క్రమశిక్షణతో కూడిన మెలగాలని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ రౌడీషీటర్లకు స్పష్టం చేశారు. టౌన్ సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లతో శనివారం ఆయన సమావేశమయ్యారు. వ్యక్తిగత వివరాలు, ఏం చేస్తున్నారు, ఎలా జీవనాన్ని కొనసాగిస్తున్నారు తదితర అంశాలను వారిని అడిగి తెలుసుకున్నారు. వివాదాలు, వ్యసనాలకు దూరంగా ఉండాలని, కష్టపడి పనిచేసి కుటుంబాలను పోషించుకోవాలని సూచించారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

జామి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడపడం చాలా ప్రమాదకరమని ఎస్ఐ వైవీ జనార్దన్ అన్నారు. శనివారం రాత్రి జామి తదితర ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనం నడిపితే జరిమానా, జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు.

పైడిమాంబ ఆలయ విస్తరణ పనులు ప్రారంభం

విజయనగరంకల్చరల్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): పైడిమాంబ ఆలయ విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా అమ్మవారి చదురు గుడి పక్కన నిర్మించిన బాలాలయంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి సోమవారం నుంచి పూజలు నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ చదురుగుడిలో దర్శనాలు నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గర్భాం విద్యార్థులు

మెరకముడిదాం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పరుగు పందెం పోటీలకు గర్భాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. 800 మీటర్ల విభాగంలో యలమంచిలి ప్రసాద్, 400 మీటర్ల విభాగంలో బూటు చందు, నాబాన శాంతారావు, 200 మీటర్ల విభాగంలో సుంకరి నవీన్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బి.సూర్యనారాయణ, పీడీ పి.పార్థసారథి తెలిపారు.


మెరకముడిదాం: ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రెజ్లింగ్‌లో సత్తాచాటిన గరివిడి విద్యార్థులు


పతకాలతో విద్యార్థులు

గరివిడి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో గరివిడి ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. శుక్రవారం విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు కడగల కిశోర్, గురాన దిలీప్, మాడుగుల అఖిల్, ఆరంగి ఉన్నుక్త రజత పతకాలు సాధించినట్టు హెచ్‌ఎం ఎం.నిర్మల తెలిపారు. విజేతలను హెచ్‌ఎంతోపాటు ఎంఈవో పి.రామారావు, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.ఉదయకుమార్ అభినందించారు.

క్రీడాలోకం

క్రీడల్లో రాణించాలి

రాజాం రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ అన్నారు. పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన స్పోర్ట్స్‌మీట్‌ను ఆయన ప్రారంభించి విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేయడంతో పాటు విద్య, ఉద్యోగావకాశాలకు కూడా దోహదం చేస్తాయన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీచైతన్య రీజనల్ అధికారి శ్రీనివాసరావు, ప్రభాకరరావు, బాలరాజు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక


నెల్లిమర్ల : వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నెల్లిమర్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు జిల్లా నుంచి 38 మంది బాలబాలికలు ఎంపికయ్యారు. కొండవెలగాడలో శనివారం జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభచాటిన 18మంది బాలికలు, 20మంది బాలురును రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 14,15,16 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. కార్యక్రమంలో జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బెల్లాన లక్ష్మి, సెక్రటరీ చల్లా రాము, వెయిట్ లిఫ్టింగ్ అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుడు వల్లూరి శ్రీనివాసరావు, కోచ్ మద్దిల శ్రీనివాసరావు, పి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మహిళా క్రికెట్ జట్టుకు కొత్తవలస విద్యార్థిని

కొత్తవలస, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అండర్-19 జాతీయ మహిళా క్రికెట్ జట్టుకు కొత్తవలస జడ్పీ హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని పుష్పిత గౌడ్‌కుమార్ ఎంపికైనట్టు హైస్కూల్ హెచ్‌ఎం ఈశ్వరరావు తెలిపారు. ఈనెల 7,8 తేదీల్లో శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పుష్పిత రాణించింది. నాలుగు మ్యాచ్‌ల్లో 250 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచింది. దీంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది.

నిర్వహణ లేక నిరుపయోగం

● శిథిలావస్థకు చేరుతున్న వైనం ● ఇదీ 19వ వార్డులో సామూహిక మరుగుదొడ్ల పరిస్థితి

పాలకొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాలకొండ నగర పంచాయతీ పరిధిలోగల 19వ వార్డులో లక్షలాది రూపాయల ప్రజాధనం నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు నిర్వహణ లేకపోవడంతో మూలకుచేరాయి.ఈ వార్డులో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా అప్పటి నగరపంచాయతీ ఛైర్‌పర్సన్ పల్లా విజయనిర్మల 2018లో మరుగుదొడ్లప్రారంభించారు. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ హయాంలోనిర్వహణపై శ్రద్ధవహించకపోవడంతో మూలకుచేరాయి. ప్రస్తుతం మరుగుదొడ్లనిర్మించిన పరిసరాల్లో చెత్త,గడ్డి పెద్ద మొత్తంలో డంప్ చేయడంతో అక్కడకు వెళ్లడానికి దారిలేకుండా పోయింది. దీనికి తోడు అవి ఇటీవల కురిసిన వర్షాలకు కుళ్లుతుండడంతో దుర్వాసన వెలువడుతోందని స్థానికులు వాపోతున్నారు. దీనికితోడు లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన మరుగుదోడ్లు వినియోగంలో లేకపోవడంతో శిథిలావస్థకు చేరుతున్నాయి.ఇప్పటికైనా నగరపంచాయతీ సిబ్బంది ఇక్కడ పేరుకుపోయిన చెత్తను తొలగించి మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని 19వ వార్డు మాజీ కౌన్సిలర్ ఎన్ని ప్రసాద్‌తోపాటు పలువురు కోరుతున్నారు.



మరుగుదొడ్ల వద్దకు వెళ్లే మార్గంలో చెత్త, గడ్డి వేసిన దృశ్యం

సమస్యల పరిష్కారానికి కృషి: విప్



వినతులు పరిశీలిస్తున్న జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి):అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి హామీనిచ్చారు.గుమ్మలక్ష్మీపురంలోని క్యాంప్‌కార్యాలయంలో శనివారం ప్రజాదర్బార్ నిర్వహించారు.ఈసందర్భంగా ఐదుమండలాల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలను వినతిపత్రాలను అందించారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

అనధికారికంగా మద్యం విక్రయిస్తే చర్యలు

పార్వతీపురంటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అనధికారికంగా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని పార్వతీపురం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శిరీష హెచ్చరించారు. శనివారం పార్వతీపురం, కొమరాడ మండలాల్లోని పలు షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ఏడు అనధికార మద్యం షాపులపై కేసులు నమోదు చేసి 13.86 లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

చెట్టు కొమ్మపడి ఒకరికి గాయాలు

భామిని, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భామిని సమీపంలో ఓ చెట్టు కొమ్మపడడంతో ద్విచక్రవాహనంపై వెళ్తున్న కొత్తూరు సచివాలయ జూనియర్ అసిస్టెంట్ గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. అలికాం-బత్తిలి రహదారిలో భారీ వాహనాలు వెళ్లేందుకు వీలుగా అడ్డుగా ఉన్న కొమ్మలను నరికి ఇటీవల చెట్లపైనే విడిచిపెట్టారు. శనివారం మనుమకొండ గ్రామానికి చెందిన, కొత్తూరు సచివాలయ జూనియర్ అసిస్టెంట్ బిడ్డిక జితేంద్ర కొత్తూరు ద్విచక్రవాహనంలో వెళ్తున్నాడు.భామిని సమీపంలో హఠాత్తుగా చెట్టుకొమ్మ వాహనంపై పడడంతో జితేంద్ర గాయపడ్డాడు. స్థానికులు భామిని పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. అలికాం-బత్తిలి రహదారిలో పలుచోట్ల కొమ్మలు కోసి చెట్లపైనే విడిచిపెట్టడంతో తరచూ రోడ్డుపై పడుతుండడంతో భయాందోళన చెందుతున్నామని పలువురు చెబుతున్నారు.

ఆటో ఢీకొని ఒకరు..

సీతంపేట రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి):మండలంలోని హడ్డుబంగి సమీపంలో శనివారం ఆటోఢీకొన్న ప్రమాదంలో గిరిజనుడు సవర రామారావు గాయపడ్డాడు. ఎస్‌ఐ వై.అమ్మన్నరావు కథనం మేరకు.. చింతాడ గ్రామానికి చెందిన సవర రామారావు కొత్తూరు నుంచి ద్విచక్రవాహనంపై తన స్వగ్రామానికి వస్తున్నాడు. సీతంపేట నుంచి కొత్తూరు వైపు వెళ్తున్న ఆటో హడ్డుబంగి సమీపంలోని రైతుభరోసా కేంద్రం జంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న రామారావు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది.దీంతో రామారావు కాలికి తీవ్రగాయమైంది. క్షతగాత్రుడిని స్థానికులు 108 వాహనంలో సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.ఈ మేరకు కేసు నమోదుచేశారు.

సీతంపేటలో జిల్లాస్థాయి క్రీడాపోటీలు



జావెలిన్‌త్రో విసురుతున్న విద్యార్థి

సీతంపేట రూరల్,నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సీతంపేటలోని గ్రీన్‌ఫీల్డ్ క్రీడా మైదానంలో ఐటీడీఏ పరిధిలో గిరిజనసంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు జనజాతీయ గౌరవ దివస్‌లో భాగంగా శనివారం జిల్లాస్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. ఐటీడీఏ పరిధిలోని మూడు క్లస్టర్ల నుంచి వివిధ పాఠశాలలకు చెందిన 150 మంది గిరిజన విద్యార్థులు కబడ్డీ,వాలీబాల్,ఆర్చరీ,జావెలిన్ త్రో తదితర క్రీడల్లో పాల్గొన్నారు. ఇక్కడ ప్రథమ,ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులు విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్రస్థాయి వాలీబాల్,కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నట్లు స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకబ్‌దయానంద్ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

వీరఘట్టం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి):మండలంలోని గంగంపేట ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు బిర్సాముండా జయంతి, జనజాతీయ గౌరవదివస్-2025లో భాగంగా విశాఖపట్నంలో గిరిజనశాఖ, గిరిజన సాంస్కృతిక పరిశోధ, శిక్షణ సంస్థ నిర్వహిచబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వక్తృత్వం, వ్యాసరచన పోటీలో ఏడో తరగతి విద్యార్థులు నిమ్మకవిశాల్,నిమ్మకవంశీ, వాలీబాల్‌కు తొమ్మిదోతరగతి విద్యార్థి బిడ్డిక జీవన్ ఎంపికయ్యారు.ఈమేరకు వారికి హెచ్‌ఎం ఎం.భాస్కరరావు, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ ఛైర్మన్ కూరంగి రాజేశ్వరి, గ్రామస్థులు అభినందించారు.

సీఆర్టీలకు ఎంటీఎస్ అమలు చేయాలి

పాచిపెంట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కేజీబీవీల్లో పనిచేస్తున్న సీఆర్టీలకు మినిమమ్ టైం స్కేల్ (ఎంటీఎస్) అమలు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర నేత కె.విజయగౌరి డిమాండ్‌చేశారు. శనివారం పాచిపెంట కేజీబీవీ సీఆర్టీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. 2005 నుంచి పనిచేస్తున్న వారికి వేతనాలు పెంచలేదని తెలిపారు. పీఏబీ ప్రకారం వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఉత్తరాంధ్రకు చెందిన ఆరు జిల్లాల కేజీబీవీ ఉపాధ్యాయులతో 23న విశాఖలో సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆమెతో యూటీఎఫ్ నేతలు కె.ఆనంద్, ముఖి గణపతి ఉన్నారు.

పాత రెవెన్యూడివిజన్‌ను జిల్లాగా చేయాలి

● మంత్రి నిమ్మలను కలిసిన పాలకొండ జిల్లా సాధన సమితి సభ్యులు

పాలకొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాలకొండ పాత రెవెన్యూ డివిజన్‌ను జిల్లా చేయాలని, లేకపోతే శ్రీకాకుళం జిల్లాలో కలపాలని పాలకొండ జిల్లా సాధనసమితి సభ్యులు కోరారు.ఈ మేరకు సాధనసమితి అధ్యక్షుడు బుడితి అప్పలనాయుడు ఆధ్వర్యంలో జిల్లాల పునర్విభజన సబ్‌కమిటీలో సభ్యుడిగాఉన్న నీటిపారుదల శాఖామంత్రి నిమ్మల రామానాయుడును పాలకొల్లులోని క్యాంప్ కార్యాలయంలో శనివారం రాత్రి కలిసి వినతిపత్రం అందజేశారు. పాలకొండ ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు.సబ్‌కమిటీతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకొని వెళ్లి తన వంతు కృషి చేస్తానని మంత్రి హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో వారాడ సుమంత్ నాయుడు, సబ్బ నానాజీ, రుంకు రామకృష్ణ, తుమ్మగుంట శంకరరావు, ఆనెపు వెంకటరమణ, పైల అక్కలనాయుడు, గుమ్మిడి గోవింద, తుమ్మగుంట జగదీష్, మజ్జి మోహన్, కనపాక ధనుంజయ, గురుగుబిల్లి చంద్రశేఖర్, గణపతిరావు పాల్గొన్నారు.



రామానాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న సాధన సమితి సభ్యులు

పెద్దగెడ్డకు రూ.67 కోట్ల మంజూరు

● కొట్టక్కి వద్ద వంద ఎకరాల్లో పార్క్: మంత్రి కొండపల్లి శ్రీనివాస్

సాలూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పాచిపెంట సమీపంలో వేగావతి నదిపై ఉన్న పెద్దగెడ్డ జలాశయాన్ని ప్రత్యేక ప్రాజెక్టుగా కేంద్రప్రభుత్వం సీఎం చంద్రబాబునాయుడు సూచనల మేరక ప్రకటించి రూ.67 కోట్ల మంజూరు చేసినట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఈనిధులతో పైపుల ద్వారా సాగునీటిని అందించేదుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. శనివారం సాలూరులో మోకాళ్లకు శస్త్రచికిత్స చేయించుకున్న మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్రఉపాధ్యక్షుడు ఆర్పీభంజ్‌దేవ్‌ను పరామర్శించారు.ఈసందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ సాలూరుకు సమీపంలో కొట్టక్కి వద్ద వంద ఎకరాల్లో పార్కు, చిన్న, పెద్దతరహా పరిశ్రమలు నిర్మించేందుకు రంగం సిద్ధం చేసినట్టు తెలిపారు. మొదటివిడతగా రూ.10 కోట్లు పార్కు నిర్మాణం కోసం మంజూరైనట్లు చెప్పారు. సాలూరుకు సుమారు 10కిలోమీటర్ల దూరంలో గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణం జరుగుతోందని తెలిపారు. పెద్దగెడ్డ జలాశయన్ని స్పెషల్ ప్రాజెక్టుగా ప్రకటించడంతో పైపులైన్లు ఏర్పాటుచేసి మరిన్ని భూములకు సాగునీరిచ్చే ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు.జీగిరాం జ్యూట్ ఫ్యాక్టరీకి సంబంధించి ఇప్పటికే ఆ యాజమాన్యంతో మాట్లాడామని,తెరిపించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు.లారీఅనుబంధ పరిశ్రమను కూడా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీపట్టణాధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, పాచిపెంట నాయకులు పిన్నింటి ప్రసాద్‌బాబు, పప్పల మోహనరావు, డబ్బి కృష్ణ, బలగ పైడిరాజు పాల్గొన్నారు.



భంజ్‌దేవ్‌తో మాట్లాడుతున్న కొండపల్లి శ్రీనివాస్

బస్సులు లేక ప్రయాణికుల బేజారు

● పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో తప్పని అగచాట్లు

పార్వతీపురంటౌన్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పలుచోట్లకు చేరుకోవడానికి అవసరమైనన్ని బస్సులు లేకపోవడంతో ప్రయాణికులకు అగచాట్లు తప్పడంలేదు. ప్రతి పావుగంటకు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఒక బస్సు చొప్పున నడుపుతున్నామని అధికారులు చెబుతున్నా, సకాలంలో బస్సులు అందుబాటులో లేవని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. ప్రతిరోజూ ఆర్టీసీకాంప్లెక్స్ నుంచి పార్వతీపురం, విజయనగరం,విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలతో పాటు ఇతర జిల్లాలు, అంతర్రాష్ట్ర బస్సు సర్వీసులు నడుపుతున్నారు. అయితే పూర్తిస్థాయిలో సర్వీసులు తిప్పకపోవడం, టైమ్‌టైమ్, సకాలంలో బస్సులు రాకపోవడం వల్ల ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సివస్తోందని పలువురు వాపోతున్నారు. ఇక్కడి ఆర్టీసీ అధికారులు మాత్రం 15 నుంచి 20 నిమిషాల మధ్యలో జిల్లానే కాకుండా ఇతర జిల్లాలకు బస్సులను నడుపుతున్నట్లు చెబుతున్నారు. అయితే పార్వతీపురం కాంప్లెక్స్ నుంచి పూర్తిస్థాయిలో సర్వీసులు లేకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందిపడుతున్నారు. చుట్టుపక్కల మండలాల నుంచి పార్వతీపురంలో పలు విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు బస్సుల సమస్య వల్ల సకాలంలో చేరుకోలేకపోతున్నామని వాపోతున్నారు.కాగా పార్వతీపురం డిపో నుంచి పాలకొండ డిపోకు ప్రతి 15 నిమిషాలకో బస్సును, ఇతర జిల్లాలకు 20 నిమిషాలకు ఒక బస్సును నడుపుతున్నట్లు పార్వతీపురం ఆర్టీసీ డిపో మేనేజర్ లక్ష్మణరావు తెలిపారు.



బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

తోటపల్లి ఆలయ ట్రస్టు బోర్డు సభ్యుల నియామకం

గరుగుబిల్లి/గుమ్మలక్ష్మీపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాలకు సంబంధించి ధార్మిక పరిషత్ ట్రస్టు బోర్డు సభ్యులను నియమించింది. సభ్యులను నియమిస్తూ దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు శనివారం గుమ్మలక్ష్మీపురంలో సభ్యులకు నియామక ఉత్తర్వులను కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అందజేశారు. సభ్యులుగా ఎం.పకీరునాయుడు, ఆర్.రాజేశ్వరి, ఎస్.పకీరునాయుడు, జి.మీనా, వి.పద్మజ, ఎం.నారాయణరావు, ఎ.జానకి, బి.సుభాషిని, భగవాన్ వరప్రసాద్ మిశ్రా, ఎస్.లక్ష్మి, ఎం.కృష్ణంనాయుడు, అఫీషియో మెంబర్‌గా ఆలయ ప్రధాన అర్చకులు వీవీ అప్పలాచార్యులను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసినట్లు విప్ తెలిపారు. 12 మందిని సభ్యుల ఏకాభిప్రాయంతో ఛైర్మన్ ఎంపిక జరగనుందని చెప్పారు. కార్యక్రమంలో ఈవో బి.శ్రీనివాస్, కార్పొరేషన్ డైరెక్టర్లు ఎం.మధుసూదనరావు, అంబటి రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు వై.శ్రీనివాసరావు, ఆలయ అభివృద్ధి సేవా ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ డి.పారినాయుడు, సభ్యులు ఎం.పకీరునాయుడు, సిబ్బంది ఎం.మురళీమోహన్, జి.శ్రీధర్ పాల్గొన్నారు.

బాలల ఆరోగ్య శ్రేయస్సుకు కృషి చేయాలి

● రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమ జిల్లా అధికారి జగన్మోహనరావు

గరుగుబిల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సర్వేలు, హెల్త్ స్క్రీనింగ్‌లు సమగ్రంగా నిర్వహించి బాలల ఆరోగ్య నివేదికలను ఎప్పటికప్పుడు విశ్లేషణ చేసి వారి ఆరోగ్య శ్రేయస్సుకు సమష్టిగా కృషి చేయాలని రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమ జిల్లా అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు కోరారు. శనివారం మండలంలోని నందివానివలస, తోటపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణ తీరును పరిశీలించారు. తొలుత టీకా కార్యక్రమాన్ని తనిఖీచేశారు రికార్డులను పరిశీలించి వివరాలు స్పష్టంగా ఉండాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. చిన్నారుల ఆరోగ్యం, ఎదుగుదల నివేదికల రికార్డులను తనిఖీ చేసి అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామస్థులతో మాట్లాడి సంచార చికిత్స వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం తోటపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయ, వైద్య సిబ్బందితో విద్యార్థుల హెల్త్ స్క్రీనింగ్‌పై సమీక్షించారు. కార్యక్రమంలో ఏఎంవో సూర్యనారాయణ, హెచ్‌ఎం జె.ప్రపూర్ణకుమారి, హెల్త్ సూపర్‌వైజర్ ఎం.సన్యాసమ్మ, వైద్య సిబ్బంది శ్రావణి, పద్మావతి పాల్గొన్నారు.



నందివానివలసలో ఆరోగ్య సర్వే రికార్డులను పరిశీలిస్తున్న జగన్మోహనరావు

పాఠశాల భవనాలు పూర్తి చేయించండి

●గిరిజనాభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్

జియ్యమ్మవలస, నవంబరు 8 ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంత పరిధిలో పాఠశాల భవన నిర్మాణాలు గిరిజనాభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆరిక చంద్రశేఖర్ కోరారు. శనివారం పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆర్‌ఆర్‌బీపురంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని చినతోలుమండగూడ, నిడగళ్లుగూడ, పెదదోడిజ, తదితర గ్రామాల్లో సమగ్ర శిక్షా అభియాన్ నిధులతో ముందుగా కొంతఅడ్వాన్స్ ఇవ్వడంవల్ల నిర్మాణాలుజరిగాయని తెలిపారు.బిల్లులు జాప్యం వల్ల భవనాలు అసం పూర్తిగా ఉన్నాయని చెప్పారు. పెండింగ్ బిల్లులు మంజూరు చేసి అసంపూర్తిగా ఉండిపోయిన భవనాలను పూర్తి చేయాలని కోరినట్లు తెలిపారు.

పీఎఫ్ బకాయిలు చెల్లించాలి

● ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు

రామభద్రపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయులు ప్రతినెలా దాచుకున్న పీఎఫ్ డబ్బులు సకాలంలో చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు కోరారు.శనివారం రామభద్రపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడతాయన్న ఆశతో నెలనెలా కొంతమొత్తాన్ని పీఎఫ్‌ఖాతాలో దాచుకున్నామని,వాటిని కూడా చెల్లించకపోవడం ఎంతవరకు సమంజసమనిప్రశ్నించారు.ప్రభుత్వం మిగిలిన మూడుడీఏల సంగతి కూడా మరచిపోయిందన్నారు. 11వ పీఆర్సీ గడువుతీరి రెండేళ్లు కావస్తున్నా పీఆర్‌సీ నియమించలేదని తెలిపారు.సమావేశంలో రెడ్డివేణు, కృష్ణంనాయుడు పాల్గొన్నారు.

దారి చూపించారు!

(5వ పేజీ తరువాయి)

శంకుస్థాపన చేశారు. కానీ పనులు మాత్రం పూర్తి చేయించలేకపోయారు. ఈ నేపథ్యంలో ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకున్న కూటమి ప్రభుత్వం ఆ పనుల పూర్తికి రూ.8కోట్ల 45 లక్షలు చెల్లించింది. ● గత వైసీపీ సర్కారు హయాంలో చేపట్టిన సాలూరు-దుగ్గేరు రహదారి నిర్మాణానికి కూడా బ్రేక్ పడింది. దీంతో కూటమి ప్రభుత్వం రూ. 4.5 కోట్ల వరకు పెండింగ్ బిల్లులు చెల్లించింది.

నిధుల మంజూరు ఇలా...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రహదారుల నిర్మాణానికి భారీగా నిధులు మంజూరు చేసింది. దీనిలో భాగంగా కళింగపట్నం- శ్రీకాకుళం నుంచి పార్వతీపురం వరకు రహ దారి అభివృద్ధి కోసం రూ.మూడు కోట్లు కేటాయించింది. సాలూరు-మక్కువ రహదారి నిర్మాణానికి 5.5 కోట్లు, చినబోగిలి-మక్కువకు రూ.50 లక్షలు, పాలకొండ నియోజకవర్గంలో కోడిశ -ఒంద్రుజోలకు రూ.3.5 కోట్లు, అల్లెన రహదారి నిర్మాణానికి రూ. కోటి కేటాయించారు. పార్వ తీపురం నియోజకవర్గంలో బలిజిపేట-అరసాడ రోడ్డుకు రూ. రెండున్నర కోట్లు, పనుకువలస- బలిజిపేటకు రూ. కోటి 50 లక్షలు, కురుపాం నియోజకవర్గంలో కూనేరు రహదారికి రూ.4 కోట్లు, జియ్యమ్మవలస- వనజకు రూ. కోటి మంజూరు చేశారు.

ఎక్సైజ్ శాఖకు కష్టాలు!

(5వ పేజీ తరువాయి)

రూ. 12,300 చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. అద్దె బకాయిలు ఒక్క కురుపాం తప్ప మిగిలిన వాటన్నింటికీ చెల్లిస్తున్నామని ఎక్సైజ్‌శాఖ అధికారులు చెబుతున్నారు. కురుపాం సర్కిల్ కార్యాలయానికి సంబంధించి ఇంటి యజమాని నుంచి అనుమతి రాకపోవడంతో కొంత జాప్యం జరుగుతోందన్నారు.

నిధులు ఉన్నా..

జిల్లాకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, అసిస్టెంట్ సూపరింటెండెంట్‌లు ఉంటారు. వీరికి రెండు వాహనాలు, ప్రతి సర్కిల్ కార్యాలయానికి ఒక వెహికల్ ప్రభుత్వం అనుమతినిచ్చింది. కానీ ఇవన్నీ అద్దెకు తీసుకున్న వాహనాలే. ఒక్కో వాహనానికి నెలకు రూ. 35 వేలు ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ డబ్బులతో వాహనానికి అద్దె, నెలకు అవసరమైన డీజిల్ వేసుకోవాలి. కానీ ఏప్రిల్ నుంచి వీటికి చెల్లింపులు లేవు. దీనికి సంబంధించిన నిధులు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ వద్ద ఉన్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఫైనాన్షియల్ అనుమతి రావడం లేదు. దీంతో వాహనాల అద్దె బకాయి చెల్లించలేని పరిస్థితి నెలకొంది. కొందరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది నెలకు అవసరమైన డీజిల్‌ను సొంత డబ్బులతో కొనుగోలు చేయాల్సి వస్తోంది.

సిబ్బంది పరిస్థితి ఇదీ..

జిల్లా ఎక్సైజ్‌శాఖలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది ఇందులో ఉండగా.. ప్రభుత్వం జిల్లాకు 133 పోస్టులు మంజూరు చేసింది. అయితే ప్రస్తుతం 78 మందే ఉన్నారు. జిల్లాలోని 15 మండలాలు సాలూరు, సీతానగరం , పార్వతీపురం, కురుపాం , పాలకొండ సర్కిల్ కార్యాలయాల పరిధిలో ఉన్నాయి. అయితే సిబ్బంది లేక పూర్తి పర్యవేక్షణ కొరవడుతోంది. సర్కిల్ కార్యాలయాల్లో ఉన్న కొద్దిపాటి సిబ్బందిలో ఇద్దరు న్యాయస్థానాలకు, మరో ఇద్దరు సెంట్రీ డ్యూటీలు చేయాల్సి ఉంది. మిగిలిన సిబ్బంది ఎప్పటి కప్పుడు గ్రామాల పర్యవేక్షణ చేస్తూ సారా, బెల్ట్ షాపుల విషయం తెలుసుకొని ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తుంటారు. గ్రామాల్లో రైడ్లు చేయడంతో పాటు సారా వల్ల కలిగిన అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తుంటారు. దీంతో ఉన్న సిబ్బందికి పని ఒత్తిడి అధికమవుతోంది.

ప్రభుత్వానికి నివేదించాం

జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖలో ఉన్న సమస్యలన్నీ ప్రభుత్వానికి నివేదించాం. ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నాం. సమస్యలు పరిష్కారమవుతాయని ఆశిస్తున్నాం.

- బి.శ్రీనాథుడు, సూపరింటెండెంట్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ, పార్వతీపురం మన్యం

రేపు ఐటీఐలో అప్రెంటీస్ మేళా

సాలూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో సోమవారం అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసాచారి ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు వంద వరకు పలు కంపెనీల్లో ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. మేళాకు హాజరుకానున్నవారు దరఖాస్తుతో పదో తరగతి, ఐటీఐ సర్టిఫికెట్లు, పాస్‌పోస్టు సైజు ఫోటోలు, ఆధార్, ఫోన్ నెంబరు, ఈమెయిల్ ఐడీతో సంప్రదించాలని కోరారు. అప్రెంటీస్ అయినవారు కూడా ప్లేస్‌మెంట్‌కు రావొచ్చని, స్టైఫండ్ రూ.12 నుంచి 15 వేలు ఇవ్వనున్నారని తెలిపారు.

16న శత అమృత కలశారాధన

జియ్యమ్మవలస, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జియ్యమ్మవలసలో ఈనెల 16న భగవాన్ శ్రీసత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో శతఅమృత కలశారాధన నిర్వహించనున్నారు. ఈమేరకు ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరికి ఆహ్వానించినట్లు శ్రీసత్యసాయి భజన మండలి కన్వీనర్ కె.నాగరాజు తెలిపారు. ఆ రోజు వంద కలశాలను వంద మంది నారాయణులకు వెయ్యి కేజీల బియ్యం, వందకేజీల చొప్పున 10 పది రకాల నిత్యావసర సరుకులు ప్రభుత్వవిప్ పంపిణీ చేయనున్నారని చెప్పారు. ఈ నెల 23న స్వామి వారి శత జయంత్యుత్సవాలకు కూడా ఆహ్వానించినట్లు తెలిపారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రంజిత్‌కుమార్ నాయికో

కురుపాం రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మొండెంఖల్‌కు చెందిన రంజిత్ కుమార్ నాయికో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా శనివారం విజయవాడలోని బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీలో కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చిరాంప్రసాద్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద బ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేస్తానని రంజిత్‌కుమార్ నాయితో తెలిపారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి

గరుగుబిల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): క్రమం తప్పకుండా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని గరుగుబిల్లి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యాధికారి ఎన్ఎంకే తిరుమలప్రసాద్ తెలిపారు. శనివారం గరుగుబిల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి నివారణలో స్క్రీనింగ్‌కు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. రొమ్ము, సర్వికల్, నోటి క్యాన్సర్లను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా నివారించవచ్చన్నారు. పొగాకు నమలడం, ధూమపానం, ఆల్కహాల్‌కు దూరంగా ఉండకపోవడం, క్యాన్సర్ వ్యాధి పట్ల గ్రామీ ణ, పట్టణ ప్రాంతాల్లో అవగాహన లేక పోవడంతో కేసులు పెరుగుతున్నాయన్నారు.

ఆరు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

కురుపాం రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆరు చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఏవో పి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15 నుంచి 30 తేదీల మధ్యలో ఎమ్మెల్యే చేతులమీదుగా కేంద్రాలు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

